

# సూర్య

www.suryaa.com

ఏలూరు జిల్లా పశ్చిమ గోదావరి జిల్లా

శనివారం,11 అక్టోబర్ 2025

8 పేజీలు


# 13 నుండి జిఎస్టి హేలాపురి ఉత్సవం

## 19వ తేదీ వరకు వారం రోజులు పాటు కార్యక్రమాలు పండుగ వాతావరణంలో నిర్వహించాలి



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** జిఎస్టి హేలాపురి ఉత్సవం ఈ నెల 13వ తేదీ నుండి 19వతేదీవరకువారం రోజులు పాటు జిల్లా స్థాయి కార్యక్రమాలు పండుగ వాతావరణంలో జరిగేలా యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేసి విజయవంతం చెయ్యాలని జిల్లాకలెక్టరు కె.వెట్రిసెల్వి జిల్లా అధికార్లుతో శుక్రవారం సాయంత్రం గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లాలో స్థానిక సిఆర్ రెడ్డి కళాశాలలో వారం రోజులు పాటు కార్యక్రమాలు విజయవంతం చెయ్యుటకు ప్రణాళికలు సిద్ధం చెయ్యాలని,వివిధశాఖలు అధికారులు సమన్వయంతో ఒక పండుగ వాతావరణంలో విజయవంతం చేయాలన్నారు. సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్... ప్రతిబింభించేలా షాపింగ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయాలన్నారు.ఇందుకుఅనువైన ప్రదేశం ఒకటికి రెండుసార్లు పరిశీలించి, వారినుండి ముందుగా అనుమతిని తీసుకోవాలన్నారు. జీఎస్టీ తగ్గింపు ద్వారా ప్రజలకు కలిగే లబ్దిని తెలియజేసేందుకు ఎలక్ట్రానిక్ గూడ్స్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ,ఆక్వా, స్టేషనరీ, ఇంటికి కావలసిన వివిధ రకాల వస్తువులు, పశుసంవర్ధక శాఖ, డ్వాక్రా, మెప్మా , రైతు బజార్, సూపర్ మార్కెట్, తదితర 25 నుండి 30 వరకు స్టాల్స్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఒక ప్రక్క డయాస్, రెండవ పక్క స్టాల్స్ ఏర్పాటు చెయ్యాలని, వర్షం కురిసినా ఇబ్బందులు కలగకుండా వాటర్ ప్రూఫ్ ను వినియోగించాలని అన్నారు. ప్రజలకు ఏటువంటి ఇబ్బందులు కలగకుండా శానిటేషన్,రక్షితమంచినీరు, తదితర మౌళిక సదుపాయాలు కల్పించాలని అన్నారు.ప్రతిరోజు ప్రజలకు వినోదం కలిగించే ఒక సంస్కృతిక కార్యక్రమాన్ని ఏర్పాటు చెయ్యాలని,లక్కీ డిప్ నిర్వహించి బహుమతి ప్రధానోత్సవాలు జరిగేలా చూడాలన్నారు. ఏడు రోజులు ఉత్సవం వీడియోలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చూస్తారని, ప్రధానమంత్రి ప్రకటించే అవార్డులలో ఏలూరు జిల్లా వచ్చేలా ప్రతిఒక్కరూమనస్సు పెట్టి పనిచేయాలని అన్నారు. గణతంత్ర దినోత్సవం రోజున స్టాల్స్ ఏలా ఏర్పాటు చేస్తామో, అదే స్థాయిలో స్టాల్ ఏర్పాటుచెయ్యాలని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు వివిధ శాఖల అధికారులకు విధులు ఏలా కేటాయిస్తామో, అదేవిధంగా విధులను కేటాయించాలని ఆదేశించారు. 13వ తేదీ జిల్లాలో ఒక భారీ ర్యాలీ ఏర్పాటు చేయాలని, ఎక్కడినుండి ఎక్కడ వరకు ముందుగానే ప్లాన్ చేసుకోవాలని సూచించారు. 14వ తేదీ బైక్ ర్యాలీకి అన్ని ఏర్పాట్లు చెయ్యాలని, కండిషన్లో ఉన్న మోటారు సైకిళ్లు, మహిళలు కూడా పాల్గొనే చూడాలని అందరికీ తప్పనిసరిగా హెల్మెట్లు ఉండేలా చూడాలన్నారు. ఏడు రోజులు కార్యక్రమాలు ఎలక్ట్రానిక్ మీడియా, లోకల్ సిటీ కేబుల్ ద్వారా రిలే

- తరువాయి 2లో..

## సీఎం చంద్రబాబుతో జడ్పీ మాజీ చైర్మన్ జయరాజు భేటీ



**అమరావతి/ఏలూరు,ఉమ్మడి ప.గో.జిల్లాసూర్యబ్యూరో :** ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయఅధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుని గురువారం సాయంత్రం అమరావతిలోని సచివాలయంలో జిల్లా పరిషత్ మాజీచైర్మన్ కొక్కిరిగడ్డ జయరాజు కలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని తాజా రాజకీయ పరిస్థితులు వివరించారు. తనబయోడేటాను మరోసారి సమర్పించారు. తెలుగుదేశం పార్టీకితాను అందించిన సేవలను సీఎంకు తెలిపారు. ఈ సందర్భంగాసూపర్ సిక్స్ పథకాలు అమలు పట్ల ప్రజల్లో ఎంతోసంతృప్తి కనిపిస్తోందని జయరాజు వివరించారు.

## 'పోలవరం' వైసిపి కో - ఆర్డినేటర్‌గా మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



**జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల ప్రకారం పోలవరం అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ సమన్వయ కర్తగా మరోసారి మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజును శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. ఈమేరకు బాలరాజుకు ఉత్తర్వులు అందాయి.

## ఎన్నో సంవత్సరాల పెన్షన్, జిపిఎఫ్ కేసులు పరిష్కారం

### ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులలో ఆనందం



**భీమవరం,మేజర్‌న్యూస్:** భీమవరం ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా యంత్రాంగం రాష్ట్ర ఏజీ కార్యాలయం అధికారులతో ఏర్పాటుచేసిన "జిపిఎఫ్, పెన్షన్ అదాలత్ కార్యక్రమాన్ని ఏపీ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతి ప్రియ, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు.ఈ సందర్భంగా శాంతి ప్రియ మాట్లాడుతూ సర్వీసులో ఉన్న, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తున్నామని, అందులో భాగంగా మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఉద్యోగుల చెంతకె వచ్చే కార్యక్రమం చేపట్టామన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లాలో పెన్షన్ అదాలత్ నిర్వహించుకుంటున్నామన్నారు. ప్రతి నెల ఏజీ బృందం ఆయా జిల్లాలకు రావడం జరుగుతుందని వారి వద్ద సమస్యలు

- తరువాయి 2లో..

## దానగూడెం నిందితుల బెయిల్ పిటిషన్ కొట్టివేత

బాధితులకి తక్షణమే పోలీస్ రక్షణ కల్పించాలని జిల్లా ఎస్పీని ఆదేశించిన ఎస్సీ,ఎస్టీ కోర్టు..
తన పదునైన వాదనతో ఆకట్టుకున్న న్యాయవాది జడ శ్రావణ్ కుమార్

**మచిలీపట్నం/కైకలూరు,మేజర్‌న్యూస్:** స్థానిక దానగూడెం గ్రామంలో దళితులపై జరిగిన దాడికేసులో ముద్దాయిలందరి బెయిల్ పిటిషన్లు కొట్టివేస్తూ మచిలీపట్నం జిల్లా కోర్టు శుక్రవారం సంచలన తీర్పు చెప్పింది. బాధితులు తరపున వాదనలు వినిపించిన ప్రముఖ న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ వాదనాలతో ఏకీభవించిన మచిలీపట్నం ఎస్సీ ఎస్టీ కోర్టు నిందితులందరి బెయిల్ పిటిషన్లు కొట్టివేస్తూ బాధితులందరికీ తక్షణమే పోలీసు రక్షణ ఇవ్వవలసిందిగా జిల్లా ఎస్పీని ఆదేశించింది.బాధితులందరి రక్షణ కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయవలసిందిగా ప్రభుత్వాన్ని న్యాయస్థానం ఆదేశించింది.రాష్ట్ర చరిత్రలో

- తరువాయి 2లో..

## 10 మంది అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

### 70 కాసుల బంగారం చోరీ30 కాసులు స్వాధీనం తాడేపల్లిగూడెం డిఎస్పి విశ్వనాథ్ వెల్లడి



**తణుకు,మేజర్‌న్యూస్:** తణుకులో సంచలనం సృష్టించిన దోపిడి ఘటనలో 10 మంది అంతరాష్ట్ర దొంగల ముఠా సభ్యులను అరెస్టు చేసిన పోలీసులు. తణుకులో శుక్రవారం ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో తాడేపల్లిగూడెం డిఎస్పి విశ్వనాథ్ వివరాలు వెల్లడించారు. గత నెల 26న తణుకు వారణాసి వారి వీధిలో వాకలపూడి కనకదుర్గ అనే వృద్ధురాలిని బెదిరించి 70 కాసులు బంగారు ఆభరణాలు, రూ.70వేలు నగదు అపహరించారు.ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తణుకు

- తరువాయి 2లో..

# నాబార్డ్ సేవలు విరివిగా అందించాలి

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం,మేజర్‌న్యూస్:** శుక్రవారం కలెక్టరు క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణితో నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయ జనరల్ మేనేజర్ మహేష్ ప్రసాద్ పహాడ్సింగ్ కలిసి జిల్లాలో నాబార్డ్ ప్రస్తుతం చేపడుతున్న పలు కార్యక్రమాలపై వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ సేంద్రీయ ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం జిల్లాలో రిటైల్ అవుట్లెట్లను ప్రారంభించడం, రొయ్యల పీలింగ్ షెడ్ల ఆధునీకరణ వంటి వాటికి మద్దతు ఇవ్వాలన్నారు. ఈ అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టడానికి జిల్లా యంత్రాంగం నుండి అన్ని విధాలా మద్దతు లభిస్తుందని తెలిపారు. తొలుత ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయ జనరల్ మేనేజర్ మహేష్ ప్రసాద్ పహాడ్సింగ్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు నాలుగు ఎఫ్పీఓలను నెలకొల్పడంతోపాటు, లేస్ అల్లికల మీద మహిళలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో రైతులకు, గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రయోజనం చేకూర్చే ప్రభావవంతమైన చర్యలను గుర్తించే ప్రక్రియలో నాబార్డ్ ఉందని తెలిపారు. ఇంకా జిల్లాలో చేపట్టగల కొన్ని కార్యక్రమాలను వివరించారు. వివిధ ప్రదేశాలలో గ్రామీణ సంతల నిర్మాణం, నర్సాపురం లేస్ కళాకారులకు జిఐ యూజర్ ఆథరైజేషన్ మరియు లేస్ పార్కు ఇతర మద్దతు, గ్రామీణ మార్ట్ ఏర్పాటు మొదలైన వాటి గురించి వివరించారు జిల్లా కలెక్టర్ తో సమావేశానికి ముందు నాబార్డ్ అధికారుల బృందం జిల్లా వ్యవసాయ అధికారి, పీడీ- డిఆర్డిఏ, మత్స్యశాఖ ఏడీ, జీఎం డిఐసి, డిహెచఓ, ఎంపెడా అధికారి, బ్యాంకర్లతో భేటీ అయ్యారు. నాబార్డ్ తరపున అందుబాటులో ఉన్న వివిధ పథకాల గురించి వారికి వివరించటంతో పాటు, వారి నుంచి అభివృద్ధి కార్యక్రమాలపై సేకరించిన అభిప్రాయాల జిల్లా కలెక్టర్‌తో నాబార్డ్ అధికారులు చర్చించడం జరిగింది.ఈ సమావేశంలో నాబార్డ్ పశ్చిమ గోదావరి మరియు ఏలూరు డిడిఎంలు ఎల్.నిష్యంత్ చంద్ర, టి.అనిల్ కాంత్, నాబార్డ్ అధికారులు రేఖ గోనాల్, గణేష్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జిఎస్టీపై అవగాహన ర్యాలీ

**ఏలూరు,మేజర్‌న్యూస్:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు శుక్రవారం మధ్యాహ్నం కళాశాల అర్థశాస్త్రం, వాణిజ్యశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో సూపర్ జిఎస్టీ సూపర్ సేవింగ్స్ పై ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభిస్తూ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ గుత్తా గిరిబాబు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వస్తు సేవల పై పన్నులను భారీగా తగ్గించడం ద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందని,తద్వారా ఆర్థిక కార్యకలాపాలు అభివృద్ధి చెందడం ద్వారా దేశం ఆర్థికంగా బలోపేతం అవుతుందని అన్నారు. అనంతరం నినాదాలు చేస్తూ ర్యాలీగా బయలుదేరి స్థానికంగా ఉన్న దుకాణాల్లో జిఎస్టికి సంబంధించిన కరపత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె అజయ్ కుమార్, సెట్వెల్ సీఈఓ ప్రభాకర్ రావు, జిల్లా




ఉపాధి కల్పనా కార్యాలయ సిబ్బంది, కళాశాల వివిధ విభాగాల అధ్యాపకులు వి వెంకట్రావు,డాక్టర్ ఎం రాంబాబు, డాక్టర్ ఎం విజయ కుమార్,ఎస్ పరమేశ,ఎం కృష్ణ చైతన్య,టి వెంకట దుర్గాప్రసాద్,ఎస్ సుస్మలత , తదితరులు పాల్గొన్నారు.

## దానగూడెం నిందితుల బెయిల్ పిటిషన్ కొట్టివేత

మొదటిపేజీ తరువాయి

మొట్టమొదటిసారిగా బెయిల్ పిటిషన్ వినేటప్పుడు సెక్షన్ 15 ఏ ప్రొటెక్షన్ అప్లికేషన్ వినాలి అంటూ పిటిషన్ దాఖలు చేసిన బాధిత తరపు న్యాయవాది. పిటిషన్ దాఖలు చేయడంతో కంగు తిన్న నిందితుల తరపు న్యాయవాదులు.40 రోజులైనా బెయిల్ రాకపోవడంతో నిందితుల తరపున బంధువులు హాహాకారాలు చేశారు.

దాదాపుగా 1గంటా 40 నిమిషాల తన పదునైన వాదనలతో న్యాయస్థానాన్ని ఆకట్టుకున్న శ్రవణ్ కుమార్. మొట్టమొదటిసారి హైకోర్టు నుండి జిల్లా న్యాయస్థానంలో తన పదునైన వాదనలు ఆయన వినిపించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెయిల్ ఇవ్వమని నో అబ్జెక్షన్ ఇచ్చినప్పటికీ బెయిల్ పిటిషన్ కొట్టి వేసిన న్యాయస్థానం.

## 13 నుండి జిఎస్టి హేలాపురి ఉత్సవం

మొదటిపేజీ తరువాయి

అయ్యేలా చూడాలని అన్నారు. కార్యక్రమం ప్రారంభం రోజున జిల్లా మంత్రి, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, హాజరవుతారని అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు సమర్థ వంతంగా నిర్వహించాలని అన్నారు. 19వ తేదీన అదే గ్రౌండ్లో ముందస్తుగా దీపావళి పండుగ జరిగేలా చూడాలని, ఇంటి సంప్రదాయం ప్రకారం కాకర పువ్వొత్తులు, చిచ్చుబుడ్లు, తదితర సామాగ్రిని వెలిగించుకుని, అడ్వాన్స్ దీపావళి పండుగను నిర్వహించాలని అన్నారు. ఇందుకు ముందుగా అన్ని జాగ్రత్తలు అగ్నిమాపక దళ అధికారులు ఒకటి రెండు సార్లు వెరిఫై చేసి, సర్టిఫికెట్ జారీ చేయాలన్నారు. జిఎస్టి హేలాపురి ఉత్సవంకు ముందుగానే మంచి బ్యానరు డిజైన్ చెయ్యాలని, వివిధ శాఖలు అధికారులు సమన్వయంతో పనిచేసి హేలాపురి ఉత్సవంను విజయవంతం చేయాలన్నారు.గూగుల్ మీట్లో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు, సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, ఆర్డీవోలు యం.అచ్యుత అంబరీష్, యం.ముక్కంటి, వివిధ శాఖలు అధికారులు వారి వారి కార్యాలయం నుండి పాల్గొన్నారు.

# సంకటాలను తొలగించే విఘ్నేశ్వరుడు





పెనుగొండ,మేజర్‌న్యూస్ :ప్రతి మాసంలో పౌర్ణమి తర్వత వచ్చే చతుర్థినాడు భక్తులు విశేషంగా ఆరాధించే పర్వదినం సంకటహర చతుర్థి. వినాయకుని పూజిస్తే జీవితంలోని అన్ని అడ్డంకులు, కష్టాలు తొలగిపోతాయని గణపతి పురాణంలో ప్రస్తావించబడింది. అందుకే ఈ రోజు భక్తులు విఘ్నేశ్వరుడిని ప్రత్యేక పూజలు, వ్రతాలతో ఆరాధిస్తారు.పెనుగొండ పంచాయతీ ఆవరణలో గల శ్రీ సంపత్ వినాయక స్వామి ఆలయంలో నేడు ఈ చతుర్థి పర్వదినాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. తేతల శ్రీరామారెడ్డి ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో గణపతి హోమం, అర్చన, అభిషేకం, అలంకారం, హారతులతో పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఆలయ పరిసరాలు "గణపతి బప్పా మోరియా" నినాదాలతో మారుమ్రోగుతున్నాయి.ఉదయం నుంచే భక్తులు వ్రతదీక్షతో గణనాయకుని దర్శించేందుకుతరలివస్తున్నారు. సాయంత్రం దీపారాధన అనంతరం ప్రసాద వితరణ, నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.వ్రతాన్ని నిర్వర్తించే భక్తులు రోజంతా ఉపవాసం పాటించి, రాత్రి చంద్రముని దర్శనం అనంతరం గణపతికి నైవేద్యం సమర్పించి వ్రతాన్ని పూర్తి చేస్తారు. ఈ పర్వదినం భక్తులకు సంకటాలను తొలగించి, ఐశ్వర్యం, ఆనందం ప్రసాదిస్తుందని విశ్వాసం.

## ఎన్నో సంవత్సరాల పెన్షన్, జిపిఎఫ్ కేసులు పరిష్కారం

మొదటిపేజీ తరువాయి

పరిష్కరించుకోవచ్చు అన్నారు.జిల్లా కలెక్టర్ చదలవాడ నాగ రాణి మాట్లాడుతూ జిల్లాలో పెన్షన్ అదాలత్ నిర్వహించడం ద్వారా సర్వీసులో ఉన్న ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఇటువంటి కార్యక్రమాన్ని పశ్చిమగోదావరి జిల్లాను ఎంపిక చేసి నిర్వహించడం చాలా ఆనందించదగిన విషయం అన్నారు. ఈ పెన్షన్ అదాలత్ కార్యక్రమంలో 35 మంది ఉద్యోగులకు పింఛన్ మంజూరు పత్రాలను అందించడం జరిగింది అన్నారు. అదేవిధంగా పింఛన్ సమస్యలపై పరిష్కారానికి ఏర్పాటు చేసిన కౌంటర్లో 20 మంది దరఖాస్తు చేసుకోగా 15 సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడం జరిగిందన్నారు. జిపిఎఫ్ సమస్యల కు సంబంధించి 55 మంది దరఖాస్తు చేసుకున్నా౯న్నారు. డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ మిస్.ఎన్. ఆశ్రిత పట్నాయక్ మాట్లాడుతూ ఉద్యోగుల మీ హక్కు- మీసేవ కార్యక్రమం ద్వారా కేసుల పరిష్కారానికి జిల్లాలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. అదాలత్ లోనే కాకుండా ప్రతినెల మూడు రోజులు జిల్లాలలో హెల్ప్ డెస్కులు పెట్టాలని నిర్ణయించుకున్నామని, ఆయా రోజులలో మీ సమస్యలను హెల్ప్ డెస్క్ కు తీసుకువచ్చి పరిష్క రించుకోవచ్చు అన్నారు.రాష్ట్ర ఖజానా, లెక్కల అధికారి డా.ఎన్. మోహన రావు మాట్లాడుతూ పెన్షన్ ప్రతిపాదనల సమర్పణలో త్వరలో పలుమార్పులు చేస్తూ ఫైనాన్స్ శాఖ ద్వారా జీవో రాబోతున్నదని, ప్రస్తుతం 20 పేజీలు వరకు ఉన్న పింఛను ప్రతిపాదనలను రెండు మూడు పేజీలకే పరిమితం చేసి ఆన్లైన్లో ఉద్యోగి పెన్షన్ ప్రతిపాదనలు సమర్పించుకోవచ్చు అన్నారు. అదేవిధంగా జిపిఎఫ్ స్లిప్పు వచ్చిన తర్వాత మాత్రమే బ్యాలెన్స్ తెలిసేదని దీనిలో కూడా మార్పులు తీసుకురాబోతున్నామని ఉద్యోగి ఎప్పుడైనా జిపిఎఫ్ బ్యాలెన్స్ తెలుసుకొనే విధానం రాబోతుందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు పెన్షన్ మంజూరు ప్రతిపాదనల సమర్పణ సమయంలో అధికారులు, ఉద్యోగులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. అనంతరం ఏపీ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతి ప్రియ, సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ ఎస్.కౌశల్ కార్తీక్, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ మిస్.ఎన్.ఆశ్రిత పట్నాయక్, రాష్ట్ర ఖజానా, లెక్కల అధికారి డా.ఎన్.మోహన రావులను జిల్లా ట్రెజరీ అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి దృశ్యాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, ఏ.జి కార్యాలయం సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు టి.విజయ కుమార్, ఎస్. బాలాజీ, కే.లక్ష్మి విజయ దుర్గ, ఎస్.నాగ మురళి, జిల్లా ఖజానా అధికారి మహ్మద్ మల్లర్ బేగ్, జిల్లా ఆడిట్ అధికారి ఎస్.మధు బాబు, అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్లు కే.ఆశిష్, అరుణ్ వ్యాసరాజు, ఎస్.కే.జకీర్, ఎం.నరేంద్ర, అషేర్, సుమని, కే సందీప్, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, ట్రెజరీ అధికారులు, ఉద్యోగులు, విశ్రాంతి ఉద్యోగులు, టీచర్లు, పాల్గొన్నారు.

## 10 మంది అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

మొదటిపేజీ తరువాయి

పోలీసులు దర్యాప్తు చేశారు. తణుకు పట్టణ సిఐ ఎన్.కొండయ్య ఆధ్వర్యంలో ఆరు బృందాలను డిఎస్పి విశ్వనాథ్ ఏర్పాటు చేశారు.మహారాష్ట్రకు చెందిన సందీప్ రామశంకర్ ఉపాధ్యాయ, మహమ్మద్ ఇక్బాల్ షేక్ తో పాటు రాజమండ్రి తాడితోటకు చెందిన మీసాల శ్రీనివాసరావు, నిమ్మకాయల శ్రీకాంత్, దుర్గాపు సత్యనారాయణ, దివ్వల యేసు, శ్రీకాకుళం చిన్నా, అంబటి రాజేష్, బిక్కవోలు మండలం బలబద్రపురం గ్రామానికి చెందిన గొర్రెపూడి వెంకటరమణ, తాడేపల్లిగూడెం మండలం పెద్ద తాడేపల్లి కి చెందిన కర్రీ సాయి చంద్రారెడ్డి అనే నిందితులను అరెస్టు చేసి రిమాండ్ తరలించి నట్టు డీఎస్పీ వెల్లడించారు. వాకలపూడి కనకదుర్గ నివాసంలో అధిక మొత్తంలో డబ్బు ఉంటుందని భావించిన నిందితులు ఒక పథకం ప్రకారం దోపిడీకి పాల్పడినట్లు వెల్లడి. బాధితురాలు ఇచ్చిన సమాచారంతో త్వరితగతిన కేసు దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేసినట్లు డిఎస్పి తెలిపారు. నిందితుల నుంచి సుమారు 30 కాసుల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నేరం చేసిన తర్వాత నిందితులు ముంబాయి పారిపోగా సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించి అరెస్టుచేనట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో సహకరించిన తణుకు పట్టణ, తణుకు రూరల్, తాడేపల్లిగూడెం రూరల్ సీఐలు ఎన్. కొండయ్య, బి. కృష్ణకుమార్, బీబీ రవికుమార్‌తో పాటు ఎస్ఐలు కె.శ్రీనివాస్, కె.ప్రసాద్, డి. ఆదినారాయణ, కె.చంద్రశేఖర్, పి.ప్రేమరాజుకు డిఎస్పి విశ్వనాథ్ అభినందనలు తెలిపారు.కేసు దర్యాప్తులో సహకరించిన ఎస్.శ్రీధర్, పి.సంగీతరావు, పి.సత్యనారాయణ, కానిస్టేబుళ్లు టి.రవి, డి.వెలగేశ్వరావు, పి.రాంబాబు, శివాజీ, అన్వర్, ఎం.శ్రీనివాస్, కె.శ్రీనివాస్, అక్బర్ లాల్ ను డీఎస్పీ విశ్వనాథ్ అభినందించారు.

# దివ్యాంగులకు సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగం




**జిల్లా న్యాయమూర్తి వాసంతి**

**నరసాపురం,మేజర్‌న్యూస్ :** నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పీచుపాలెం రోడ్‌లో ఉన్న కళ్యాణి రూరల్ రీహాబిలిటేషన్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ నందు నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమానికి కరస్పాండెంట్ ఎ. నళిని దేవి అధ్యక్షత వహించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిగా 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎ. వాసంతి పాల్గొని మాట్లాడుతూ, పిల్లలు ఎల్లప్పుడూ నవ్వుతూ ఉంటే ఆరోగ్యంగా ఉంటారని, రాజ్యాంగం మానసిక దివ్యాంగులకు కూడా సమాన హక్కులు కల్పించిందన్నారు. ఎవరైనా దివ్యాంగులను అవహేళన చేసిన, శారీరకంగా మానసికంగా వారిని గాని వారి తల్లిదండ్రులను గానీ అవహేళనగా మాట్లాడిన, అవమానపరచినా మండల న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. దివ్యాంగులకు ఆస్తి పరంగా ఏమైనా సమస్యలు ఉంటే ఉచిత న్యాయ సహాయాన్ని ఉపయోగించుకోవాలన్నారు. దివ్యాంగుల పట్ల కళ్యాణి రీహాబిలిటేషన్ సెంటర్ అందిస్తున్న సేవలను అభినందించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు మంచి పౌష్టికాహారాన్ని అందిస్తూ, ఆరోగ్య పరంగా మెడికల్ ట్రీట్మెంట్ కూడా తీసుకోవాలన్నారు. న్యాయ సేవా సంస్థ వారు విద్యార్థులకు పండ్లు, న్యాయవాది సూర్య ప్రకాశ్ రావు అలహారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జి. గంగరాజు, బార్ అసోసియేషన్ కార్యదర్శి వి. సూర్య ప్రకాశరావు, పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. యాదగిరి, కళ్యాణి రూరల్ మనో వికాస కేంద్రం సెక్రటరీ మోహన్ బాబు రావు, లీగల్ సర్వీసెస్ సభ్యులు దానయ్య నాయుడు, వై.డి ఫణికర్, వై. సతీష్ కుమార్ , పారా లీగల్ వాలంటీర్ లు ఎస్. దుర్గా ప్రసాద్, బి. శ్యామ్ కుమార్ , కోర్టు లైజనింగ్ సూర్య భాస్కర్, సైకాలజిస్ట్ జి జేసు ప్రసాద్ బాబు, లయన్స్ క్లబ్ సభ్యులు, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ ఆధ్వర్యంలో విద్యార్థుల నడవడిక మీద ప్రత్యేక తరగతులు



**తాడేపల్లిగూడెం, మేజర్‌న్యూస్:** లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పిలుపుమేరకు అధ్యక్షులు లయన్ చిన్నం మణీంద్ర ఆధ్వర్యంలో తేతలి సత్యనారాయణ మూర్తి జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ నందు చదివే 520 మంది విద్యార్థులకు మానసిక ఆరోగ్యం,మంచి నడవడిక పై ప్రత్యేకతలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త లయన్ బాపయ్య శర్మ మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్యం ఎంత ముఖ్యమో మానసిక ఆరోగ్యం కూడా అంత ముఖ్యమని, చదువు పరీక్షల కోసం మాత్రమే కాకుండా విజ్ఞానం పెంచుకునేందుకు నేర్చుకోవాలని విద్యార్థులకు వివరించారు. కార్యదర్శి లయన్ ఎల్ఐసి త్రిమూర్తులు మాట్లాడుతూ విద్యార్థులకు విజయం సాధించాలంటే గోల్ సెట్టింగ్ ఎలా చేసుకోవాలో టైం మేనేజ్మెంట్ ఎలా చేయాలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే మంచి నడవడికతో ఎలా ఉండాలో పిల్లలతో మాట్లాడిస్తూ నేర్పించినారు. ఈ కార్యక్రమంలో లైన్ సన్నిధి సూర్యనారాయణ మూర్తి జెడ్పీ హైస్కూల్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

# పేరిచర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక దినోత్సవం



**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్:** తాడే పల్లిగూడెం భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం పేరిచర్ల ఫౌండేషన్ చైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురలీకృష్ణం రాజు సౌజన్యంతో భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించి విద్యార్థులకు పలు బహుమతులు అందజేశారు. వరల్డ్ మెంటల్ హెల్త్ డే సందర్భంగా స్థానిక స్నేహ మైండ్ క్లినిక్ అధినేత డాక్టర్ పృద్విరాజ్ భవిత కేంద్రం సందర్శించారు. డాక్టర్ పృద్విరాజ్ మాట్లాడుతూ భవిత కేంద్రం కు మా స్నేహ మైండ్ క్లినిక్ సేవలు ఎల్లపుడు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ చెన్నా రెడ్డి సతీష్, వాకర్స్ రాజా త్రినాద్, మానేపల్లి కిరణ్, యర్రా ఆంజనేయస్వామి, భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్కే బాల ఈశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, దివ్యాంగుల పిల్లలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# వైయన్ కళాశాలలో ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ పై సదస్సు




**నరసాపురం,మేజర్‌న్యూస్ :**స్థానిక శ్రీ వై.యన్.కళాశాలలో మెనేజ్మెంట్ స్టడీస్ విభాగం,ఐక్యూఎసి ఆధ్వర్యంలో 'ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ యంగ్ సిటిజెన్' అనే అంశముపై రెండురోజుల వర్కుషాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్ నకు కోటక్ సెక్యూరిటీస్ వారి సామాజిక భాధ్యత లో భాగంగా కోన శిక్ష-(అందరికి విద్య )పధకం లో భాగం గా విజయవాడ లోని మూవ్స్ కన్సల్టెన్సీ ప్రైవేటు లిమిటెడ్, మేనేజింగ్ డైరెక్టర్ చిలుకూరి విజయ కుమార్, ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో విజయ కుమార్ మాట్లాడుతూ జాబ్ చేసినా, వ్యాపారం చేసినా డబ్బును సంపాదిస్తాము అందులో మనం సంపాదించిన డబ్బును ఖర్చు చేయగా మిగిలిన డబ్బును ఆదా చేస్తాము కాని ఫైనాన్షియల్ గా అభివృద్ధిచెందాలంటే డబ్బును ఆదా చేయడానికి ముఖ్యం గా ప్రాధాన్యత ఇచ్చి తరువాతనే డబ్బును ఖర్చు చేయాలన్నారు. రూల్ నెంబర్ 72 ద్వారా సేవింగ్స్ ప్రాముఖ్యతను వివరిస్తూ, సెక్యూరిటీస్ మార్కెట్‌లో పెట్టుబడి అంశములు,మర్చేంట్ బాంకింగ్ విధులు, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్ అందించే సర్టిఫికెట్ కోర్సెస్ వివరములు,ఉద్యోగావకాశాలను విశదీక రించారు.ఈ కార్యక్రమంలో 150 మంది ఎంబి ఏ.బి.బి.ఏ విద్యార్థినీ విద్యార్థులు,కాలేజీ అకడమిక్ అండ్ రీసెర్చ్ అడ్వైజర్ శ్రీ ఆర్. సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతపల్లి కనకారావు, డైరెక్టర్ ప్రొఫెసర్ యన్.చింతారావు, మెనేజ్మెంట్ స్టడీస్ విభాగం అధిపతి ప్రొఫెసర్ అర్. పార్ధసారధి ఐక్యూఎసి కోఆర్డినేటర్ ప్రొఫెసర్ గంధం శ్రీరామకృష్ణ, హెచ్ ఆర్ డి డైరెక్టర్ ప్రొఫెసర్ చినిమిల్లి శ్రీనివాస్, డా.అందే వెంకట రమణ, శ్రీ జి. రంగబాబు, డా.పులపర్తి వెంకట సుబ్బారావు, కే. కల్పన, డా.కె. అమ్మాజీ, కోటిపల్లి గీత, ఇంటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.వర్కుషాప్ ప్రారంభంలో,చివరలో ఎన్.ఐ ఎస్. ఎం ఆన్లైన్ టెస్ట్ పెట్టి, ఈ-సర్టిఫికెట్స్ జారీ చేశారు.

# రైతులందరికీ సకాలంలో రుణాలు

**డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి**



**నర్సాపురంరూరల్,మేజర్‌న్యూస్ :** రైతులందరికీ వ్యవసాయ అవసరాల దృష్ట్యా సకాలంలో రుణాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళి కృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మణేశ్వరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలోరూ 45 లక్షలు దీర్ఘకాలిక రుణాలను రైతులు అందించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సహకార సంఘం చైర్మన్ చాగంటి పార్థసారథి అధ్యక్షత వహించి మాట్లాడారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మురళీకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ అవసరాలకు రైతులకు పెద్ద ఎత్తున రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. సకాలంలో రుణాలు చెల్లిస్తే రైతుకు మరింత లాభం చేకూరుతుందని ఆయన అన్నారు. నాట్లు వేసేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా సహకార సంఘాల ద్వారా రుణాలు పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పర్సన్స్ దొంగ రామలక్ష్మి, గుండు బోయిన వెంకటేశ్వరరావు, కార్యదర్శి ముదునూరు సత్యనారాయణ రాజు, అకౌంటెంట్ దాసరి శ్రీనివాసరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మత్స్యకారుల సమస్యలపై కమిటీ వేయడం శుభ సూచికం



**మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు**

**నరసాపురం, మేజర్‌న్యూస్ :**కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో మత్స్యకార గ్రామాలైన ఉప్పాడ తదితర గ్రామాలలో మత్స్యకారులు పడుతున్న ఇబ్బందులు మత్స్య సంపద నశించిపోవటం వంటి సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు నిపుణుల కమిటీ వేయడం హర్షణీయమని రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు అన్నారు. శుక్రవారం నరసాపురంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మత్స్యకారుల పట్ల ఉన్న గౌరవాన్ని వ్యక్తం చేస్తూ ఆ గ్రామాలు పర్యటించి వెంటనే స్పందించటం మత్స్యకారులసమస్యలపై క్షేత్రస్థాయిలో పర్యటించడం శుభసూచకమని ఆయన అన్నారు. మత్స్యకారుల పట్లకూటమి ప్రభుత్వం నిబద్ధతకు నిదర్శనం అని పవన్ కళ్యాణ్ క్షేత్రస్థాయిలో పర్యటించి వారి సమస్యలపై వెంటనే స్పందించడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమత్స్యకారుల అందరి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## దివ్య డిజిటల్ షాపులో జీఎస్టీపై అవగాహన



**నరసాపురం, మేజర్ న్యూస్ :** స్థానికస్టీమర్ రోడ్లో ఉన్న దివ్య డిజిటల్ షాప్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ జిఎస్టి 2.0 పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంసందర్భంగా నాయకర్ మాట్లాడుతూ వ్యాపారులు,చిన్న స్థాయి వ్యాపార వేత్తలకు జిఎస్టి 2.0 ద్వారా లభించే సౌకర్యాలు, పారదర్శకమైన పన్ను విధానం, డిజిటల్ లావాదేవీల ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రజలందరూ ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, కొత్త పన్ను విధానం ద్వారా వ్యాపార రంగం మరింత అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కమర్షియల్ టాక్స్ ఆఫీసర్,మునిసిపల్ కమిషనర్ ఎం అంజయ్య, తాసిల్దార్ ఐ వి వి సత్యనారాయణ, ఎంపీడీవో వీరభద్ర రావు తో పాటు జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు జనసైనికులు పాల్గొన్నారు.

# మరో సారి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాలబొమ్మల శ్రీనివాస్



**భీమవరం/తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** తాడేపల్లిగూడెం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాల బొమ్మల శ్రీనివాస్ మూడవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు భీమవరంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ జిల్లా సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ కేంద్రమంత్రి జేడీ శీలం, కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు, మాజీ ఎంపీ,మాజీ టిటిడి అధ్యక్షులు కనుమూరి బాపిరాజు, తాడేపల్లిగూడెం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మార్నీడు బాబ్జి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. కష్టకాలంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో బాలబొమ్మల శ్రీనివాస్ కృషిని గుర్తించి మూడోసారి పట్టణ అధ్యక్షుడిగా నియమించడం జరిగిందని జెడి శీలం, కనుమూరి బాపిరాజు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆంధ్ర ప్రదేశ్ సరిహద్దు జిల్లాలైన తెలంగాణ కర్ణాటకలో అధికారంలో ఉందని ఇదే ఉత్సాహంతో రానున్న ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్లో అధికారంలో తీసుకొచ్చేందుకు క్షేత్రస్థాయి నుంచి కార్యకర్తలు కృషి చేసేందుకు అందరూ కృషి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాల బొమ్మలు శ్రీనివాస్ మాట్లాడుతూ. గత 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ క్రియేషన్ కాంగ్రెస్ పార్టీ సభ్యుడిగా ఉంటూ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అభ్యర్థుల విజయానికి కృషి చేశానని తెలిపారు. మరో సారి పార్టీ అధికారంలోకి వచ్చే వరకు పార్టీ అభివృద్ధికి తోడ్పడతానని హామీ ఇచ్చారు. ఈ నియామకం జరగడానికి సహకరించిన తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్చార్జ్ మార్నీడి బాబ్జికి కృతజ్ఞతలు తెలిపారు.

## మధ్యతరగతి కుటుంబానికి భరోసా ఎన్.డి.ఏ ప్రభుత్వం

### ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్



**తాడేపల్లిగూడెం ,మేజర్ న్యూస్:** భారతదేశ చరిత్రలో ఏ ప్రభుత్వము చేయని విధంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణలు చేసి నేటి మధ్యతరగతి కుటుంబానికి భరోసాగా నిలిచారని రాష్ట్ర విప్, బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జీఎస్టీ సంస్కరణలలో భాగంగా మహిళ సాధికారతకు భరోసా ఇవ్వాలనే సదుద్దేశంతో ఎన్డీఏ ప్రభుత్వం రోజువారి ఉపయోగించే వివిధ రకాల వస్తువులు పై జీఎస్టీ 0శాతం లేదా 5 శాతానికి తగ్గించిన నేపథ్యంలో ఆర్టీసీ డిపో, బజాజ్ ఎలక్ట్రానిక్స్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బొలిశెట్టి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా నివసిస్తున్న మధ్యతరగతి కుటుంబానికి ప్రతినెల రెండు నుండి మూడు వేల రూపాయలు ఆదా చేయగలిగిన అవకాశం కల్పించాలని ఆయన తెలిపారు.

ఈకార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్, వాణిజ్య పన్నుల శాఖ జిఎస్టి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, రూరల్ మండలం జనసేన పార్టీ అధ్యక్షులు అడపా ప్రసాద్, మైలవరపు రాజేంద్రప్రసాద్, కాళ్ల గోపికృష్ణ, పైబోయిన వెంకటరామయ్య, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 'సజ్జల'కి కృతజ్ఞతలు తెలిపిన వైసీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ బివి రావు



**కైకలూరు,మేజర్‌న్యూస్:** తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో వైసీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామ కృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన వైసీపీ రాష్ట్ర ఈసీ సభ్యులు, మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి సిఏబీవీ రావుకి మరొక కీలక పదవిలో నియమించటం జరిగింది. పార్టీలో కీలక బాధ్యతలు ఈసీ సభ్యులు గా నియమించినందుకు సజ్జలకి కృతజ్ఞతలు తెలియచేసిన బీవీ రావు. వైసిపి పార్టీ బలోపేతానికి కృషి చేయాలి అనిదిశా నిర్దేశం చేశారు. కైకలూరు నియోజకవర్గ స్థానిక సమస్యలు,రాజకీయ వ్యవహారాల గురించి సజ్జలతో బీవీరావు చర్చించారు. ఈసందర్భంగా ఈపదవి తన పైన మరింత బాధ్యత పెంచిందని కష్టపడి పని చేసి పార్టీని మరింత బలపరిచేందుకు నా వంతు కృషి చేస్తానని తెలిపారు.

# అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు





### బాధితురాలి ఇంటికి వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్ అందించిన ఎమ్మెల్యే చింతమనేని

**పెదవేగి, మేజర్‌న్యూస్:** అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి కూటమి ప్రభుత్వంలో సంక్షేమ కార్యక్రమాలు ఎలాంటి వివక్ష లేకుండా పారదర్శకంగా అమలు చేస్తున్నామని , త్వరలోనే కొత్త పింఛన్ల మంజూరుతో పాటు అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కూడా మంజూరు చేసి వారి సొంత ఇంటి కలలను సాకారం చేయటానికి చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దుగ్గిరాల లోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉదయం పలువురు నియోజకవర్గ కూటమి నాయకులు, అధికారులు, ప్రజలు ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసి పలు ఆహ్వాన పత్రికలను, పుష్ప గుచ్చాలను అందించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సత్వరమే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. బాధితులకు ఆపదలో ఆపన్న హస్తం వంటి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఎమ్మెల్యే చింతమనేని చొరవతో పెదవేగికి చెందిన ఏనుగు శ్యామల అనే మహిళకి మంజూరు అయిన రూ. 1,23,305 సీఎంఆర్ ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శుక్రవారం ఉదయం పెదవేగిలో%ని%ని బాధితురాలు ఇంటి వద్దకు వెళ్లి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా చెక్కును అందుకున్న లబ్ధిదారు ఎమ్మెల్యేకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెదవేగి సొసైటీ చైర్మన్ , క్లస్టర్ ఇంచార్జ్ తాతా సత్యనారాయణ సహా పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## 10 గంటల పని విధానానికి సిఐటియు నిరసన




**నరసాపురం, మేజర్‌న్యూస్ :** కార్మికులకు10 గంటల పని దినాన్ని రాష్ట్ర అసెంబ్లీలో చట్టం చేయడానికి వ్యతిరేకిస్తూ, సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంసందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కార్మిక వర్గం అనేక పోరాటాలు,త్యాగాలు చేసి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానానికి తుట్లు పొడుస్తూ కార్మిక వర్గ హక్కులను కాలరాసే విధంగా 10 గంటల పని విధానాన్ని తీసుకురావడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ కార్మిక వర్గాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని ఆయన తెలిపారు. ప్రస్తుత కాలంలో కార్మికులకు, ఉద్యోగులకు వారి హక్కులను చట్టాలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తూ, సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంలో తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. కార్మిక ఉద్యోగ వర్గాల హక్కులను హరించే విధంగా ఉన్న 10 గంటల పని విధానాన్ని రద్దు చేయాలని కనీస వేతనం 26 వేల రూపాయలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కవురు నరసింహస్వామి, గుబ్బల రాజేశ్వరి,బొక్క ఆదిలక్ష్మి, పెనుగొండ జ్యోతిరత్నం, వై ప్రభావతి,దొంగ రాజేశ్వరి, పులపర్తి రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

### రోగుల ఉచిత భోజనం కొరకు నూతన భవనానికి శంకుస్థాపన





**కైకలూరు,మేజర్‌న్యూస్:** స్థానిక, ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ స్థానిక కైకలూరులో సామాజిక ఆరోగ్య కేంద్రనికి వైద్యం కోసం వస్తున్న రోగులు మరియు వారితో వచ్చిన సహాయకుల కొరకు సత్యసాయి సేవా సమితి వారు నిర్వహిస్తున్న ఉచిత భోజన పథకానికి దాతల సహకారంతో నూతన భవనానికి శంకస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మరియు సిబ్బందితో ఏర్పాటు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది మరియు అభివృద్ధి కమిటీ సభ్యులు ఆసుపత్రి మౌలిక సదుపాయాలు గురించి చర్చించారు. అనంతరం ఆసుపత్రికి ప్రభుత్వం మంజూరు చేసిన కంప్యూటర్లను ప్రారంభించారు. అలాగే ఆసుపత్రిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు విద్యావంతులు కావాలి



**వీరవాసరం,మేజర్ న్యూస్ :** వీరవాసరం కాపు వనిత క్లబ్, కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాయకుదురు గ్రామం జూనియర్ కాలేజ్ నందు ఇంటర్నేషనల్ డే ఆఫ్ గర్ల్ చైల్డ్ సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. కాపు వనిత క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్. బి. లక్ష్మీ కళ్యాణి మాట్లాడుతూ అమ్మాయిలకు ముందుగా ఎడ్యుకేషన్ ఉండాలి, సమాజంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సవాల్ గురించి, అమ్మాయిల ఆరోగ్యం గురించి శ్రద్ధ వహించాలని తెలిపారు. వనిత క్లబ్ సెక్రటరీ కామిశెట్టి విజయలక్ష్మి మాట్లాడుతూ ద్రౌపది ముర్ము, నిర్మల సీతారామన్, పీవీ సింధు, సావిత్రిబాయి పూలే వంటి ప్రముఖ మహిళలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలి అని,ఆడపిల్లలు సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకుని పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపు వనిత క్లబ్ సభ్యులు ట్రెజరర్ కుంచే వేణు, అల్లంశెట్టి అన్నపూర్ణ, మల్లిపూడి అరుణ, కాపు సర్వీస్ క్లబ్ సెక్రటరీ ముఖమట్ల దుర్గాప్రసాద్, టీచర్ దూది అరుణ, హై స్కూల్ హెడ్ మాస్టర్, హైస్కూల్ టీచర్ల బృందం పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం పోస్టర్లు ఆవిష్కరణ



**పోడూరు,మేజర్ న్యూస్** :ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్లను ఆచంట నియోజకవర్గంలోని తూర్పు పాలెం వైయస్ఆర్సీపీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు మాజీ మంత్రి శ్రీ రంగనాథ్ రాజు ఆదేశాలు మేరకు పోస్టర్ ఆవిష్కరించారు.పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు అక్టోబర్ 10 వ తారీకు నుండి నవంబరు 22 వరకు రచ్చబండ నియోజకవర్గంలో 50వేల సంతకాల సేకరణ అక్టోబర్ 28న నియోజవర్గ కేంద్రాలలో ర్యాలీ నవంబరు12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీ,నవంబర్ 23న నియోజకవర్గాలలో సేకరించిన సంతకాలను జిల్లా కేంద్రాలకు సంతకాల పత్రాలు, నవంబర్ 24న జిల్లా కేంద్రాల నుండి పార్టీ కేంద్ర కార్యాలయానికి సంతకాల పత్రాలు,గవర్నర్కు నివేదన కోటి సంతకాల పత్రాలు అందజేత,మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ జరిగితే పేద విద్యార్థులకు వైద్య విద్య అందనంత దూరమౌతుంది ఫీజులు భరించలేనంతగా పెరుగుతాయి ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందుబాటులో లేకుండా పోతుంది ప్రజారోగ్య వ్యవస్థ క్షీణిస్తుందన్నారు. లక్ష కోట్ల విలువ చేసే ప్రజల ఆస్తులు ప్రైవేటుపరం అవుతాయి ప్రైవేటు ఆసుపత్రులు ప్రజలను దోచుకునే అవకాశం ఏర్పడుతుంది ప్రజా నిధులతో నిర్మించిన సంస్థలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన ప్రాథమిక హక్కు పై జరుగుతున్న దాడిగా మేము భావిస్తున్నా మన్నారు.ప్రతి జిల్లాలో నాణ్యమైన విద్య వైద్యం వైద్య సేవలు అందించేలా ఉద్దేశాన్ని భంగం కలిగించకూడదు, ప్రజా ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వం దేయం కావాలిఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ గూడూరి దేవేంద్రుడు కర్రీ వేణు బాబు దాట్ల గోపాలకృష్ణరాజు చంటి రాజుసత్తి విష్ణుకుమార్ రెడ్డి పోతుమూడి రామచంద్రరావుసత్తి సుబ్బారెడ్డి కొవ్వూరి వేణుమాధవ్ రెడ్డి కీర్తి తాతాజీచింతపల్లి గురు ప్రసాద్ రావి రత్నకుమార్

గుడాల చంటి గుబ్బల వీరబ్రహ్మం గొట్టుముక్కల రమేష్ రామణ వీర్రాజు దంపన బోయిన బాబురావు చిటికెన బాబిపులిదిండి వెంకటేశ్వరరావు కుక్కల సూరిబాబు పడాల అబ్బు బుడితి భీమారావు నేదురి సుందర్ రావు ముప్పిడి శ్యాంబాబు పాలా వెంకట నరసయ్యబోసుపాముల శ్రీను పాల ఏడుకొండలు పైడి ఏసుబాబు బొక్క చిట్టిబాబు పైన సత్యనారాయణ కుసుమే రాంబాబు కేసరపల్లి రమేష్ పురిల్ల శ్రీను కేసరపల్లి గణపతి కలగట్ల సాగర్ నగరేశ్వర స్వామి తమనంపూడి సూర్య కమలంపూడి పల్లారెడ్డి పీతాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పంగిడి గూడెంలో భారీ అన్న సమారాధన



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** మండలంలోని పంగిడిగూడెం గ్రామంలో 4వ వార్షికోత్సవ దసరా శరన్నవరాత్రులలో అమ్మవారిని రోజుకో అలంకరణలో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు.

ఉత్సవాలలో భాగముగా శుక్రవారం ఉదయం 30వేల మంది భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ క్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అధికారుల తీరుతో ప్రభుత్వ ఆదాయానికి గండి







**అక్రమంగా జామాయిలు నరికి తరలింపుతో లక్షల నష్టపోతున్న ప్రభుత్వం**

**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్**:జీలుగుమిల్లి పరిధిలోని అటవీ శాఖ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యంతో అడవిలోని జామాయిల్ బాదులు అక్రమంగా నరికి తరలించడం నిత్య కృత్యం అయిపోయింది దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. అయినా అటవీ శాఖ అధికారులలో చలనం రావడం లేదు. అటవీ అధికారుల నిర్లక్ష్యంతోనే జామాయిల్ బాదులు అక్రమంగా తరలి పోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అడవి చుట్టూరా కందకాలు తీసి కొన్ని ప్రాంతాలలో మాత్రమే అడవులకు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేశారు. అక్రమార్కులు జామాయిల్ బాదులను నరికి తరలించాలంటే ఆ మార్గాల నుంచి మాత్రమే రావలసి ఉంటుంది. అయినా ఎటువంటి బెరుకు భయమో లేకుండా జామాయిల్ బాదులను అక్రమంగా నరికి తరలిస్తున్నారు. అంటే అది ఇంటి దొంగల ప్రమేయమేనని పలువురు పేర్కొంటున్నారు. కాసులకు కక్కుర్తి పడి కాపలాగా ఉండాల్సిన సిబ్బంది చేతివాటంతో ఈ అక్రమ దందాకు తెరలేపారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అటవీ ప్రాంతంలో పశువులు మేకలు మేపేందుకు వెళితే ఆంక్షలు విధించే అధికారులు సిబ్బంది అక్రమార్కులు గొడ్డలితో చెట్లు నరికి ట్రాక్టర్ పై వేసుకుని తరలిస్తుంటే చోద్యం చూస్తున్నారా? అంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అడవి తమ పరిధిలోది కాబట్టి తామేం చేసిన చెల్లుబాటు అవుతుందనే ధరణిలో అటవీ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారని అంటున్నారు. ఇంటిలో కట్టెల పొయ్యి వెలిగించుకునేందుకు ఎండిపోయిన పుల్లలు తెచ్చుకోవాలంటే పర్మిషన్ ఇవ్వని సిబ్బంది పెద్దపెద్ద జామాయిల్ బాదులను నరికి తరలిస్తుంటే పర్మిషన్ ఎలా ఇస్తున్నారు అంటూ ఎదురు ప్రశ్నిస్తున్నారు. అంటే ఒక ట్రాక్టర్ కు కనీసం 40 బాదులు తరలిస్తారని ఒక ట్రాక్టర్ను అడవి దాటిస్తే సుమారు 50 వేల వరకు జేబులోకి వచ్చి పడతాయి కాబట్టే కొందరు అధికారులు అక్రమ వ్యాపారానికి తెర లేపారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చుట్టూరా అడవి ఉండి పొయ్యిలోకి కట్టెలు తెచ్చుకోవాలన్న, పశువులు, గొర్రెలు, మేకలను మేపుకోవాలంటే ఎన్నో సివాట్లు పడాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడవికి రాజులం మేమే తామేం చేసినా అడిగే వారెవరు? అనే ధరణిలో సిబ్బంది ఉంటారని వాపోతున్నారు. గ్రామంలోని రహదారి నుంచి సుమారు మూడు కిలోమీటర్ల లోపల ఉన్న అడవిలో బాదులను నరికి ట్రాక్టర్ పై తరలిస్తున్నారు అంటే అది ఆ సిబ్బంది ఇచ్చిన ధైర్యమే అంటున్నారు.

ఉన్నత అధికారులు జీలుగుమిల్లి కార్పొరేషన్ పరిధిలో ఉన్న జామాయిల్ అడవిని పరిశీలించి అక్రమంగా తరలింపుకు సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.పి అంకంపాలెం ఎంపీటీసీ నాలి శ్రీనివాస్ యాదవ్ సిపిఐ మండల నాయకులు కొప్పుల నాగరాజు మాట్లాడుతూ అటవీ శాఖ అధికారులు సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. అంతేకాకుండా ఆ ప్రాంతాల్లో ఉన్న రైతులు పశువులు మేపేందుకు అనుమతించని అధికారులు అక్రమార్కులకు ఎలా చేయూతనిస్తున్నారని ప్రశ్నించారు.ఆ ప్రాంతాల్లో ఉండే రైతులను ఎన్నో ఇబ్బందులు గురిచేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న అటవీ శాఖ అధికారులపై విచారణ చేసి బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కానిపక్షంలో ఏలూరు ఎంపీ పుట్ట మహేష్ కుమార్ యాదవ్,అలాగే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని న్యాయం చేసేందుకు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. అడవి శాఖ సిబ్బంది తీరు వలన ఆ ప్రాంతంలో జీవించే వ్యక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. టిడిపి మండల బీసీ సెల్ అధ్యక్షులు తోట బాలు, రాగం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. జరిగిన సంఘటనపై కార్పొరేషన్ రేంజ్ అధికారి వసంత కుమారి, డిపిఎం రెహమాన్ నీ వివరణ కోరగా జీలుగుమిల్లి పరిధిలోని బీట్‌లో జామాయిల్ బాదులను అక్రమంగా నరికి తరలించడం వాస్తవమేనని, సిబ్బంది తక్కువగా ఉండటంతో గమనించలేకపోయినట్లు తెలిపారు. అక్రమంగా తరలింపు చేపట్టిన వారిపై విచారణ చేసి సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్న కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కార్తీక మాసంలో వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలి



**పాలకొల్లు, మేజర్ న్యూస్:** పంచారామ క్షేత్రాలలో ఒకటైన శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి వారి దేవ స్థానము నందు శుక్రవారం సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈనెల 22 నుండి నవంబర్ 20 వరకు జరగబోవు కార్తీక మాసంనకు సంబంధించి సమన్వయ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్ లో భక్తుల సౌకర్యార్థం అన్ని శాఖలకు సంబంధించి అధికారులు పాల్గొని చర్చించారు ,ఈ కార్యక్రమంలో కునరసాపురం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ దాసి రాజు, పాలకొల్లు తహసీల్దార్ వై. దుర్గకిషోర్, మున్సిపల్ కమిషనర్ పార్థసారథి, ఎంపీడీవో ఉమ మహేశ్వరావు, పాలకొల్లు పట్టణ సీఐ రజనికుమార్ , ఫైర్ ఆఫీసర్ జానకి రామయ్య , మెడికల్ ఆఫీసర్ చంద్ర శేఖర్ , ఎలక్ట్రికల్ ఎఈ బాబ్జి, ఆలయ కార్యనిర్వాహణాధికారి ముచ్చెర్ల శ్రీనివాసరావు , ఆలయ చైర్మన్ మీసాల రామచంద్రరావు , ఆలయ ధర్మకర్తలు, ఆలయ ప్రధాన అర్చకులు కృష్టప్ప, ప్రధాన అర్చకులు అనిల్ ,అర్చకులు పూర్ణయ్య , అర్చకులు వీరబాబు ,సూపరింటెండెంట్ వాసు , ఆలయ సిబ్బంది పాల్గొన్నారు,

## మానసిక ఆరోగ్యంపై అవగాహన




**ద్వారక తిరుమల, మేజర్ న్యూస్:** వరల్డ్ మెంటల్ హెల్త్ వీక్‌లో భాగంగా ఏపిసి పంకజ్ కుమార్, జిసిడిఓ బి. నవీన ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం పంగిడి గూడెం జిల్లా పరిషత్ హై స్కూల్ ప్లస్‌లో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏం కౌసల్య ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో సమగ్ర శిక్ష అభియాన్ నుంచి జిల్లా మానసిక కౌన్సెలర్ ఎమ్. సుధీర్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ దృఢమైన మానసిక ఆరోగ్యంతోనే నాణ్యమైన విద్య సాధ్యం అని విద్యార్థులు మానసిక ఆరోగ్యం పై అవగాహన పెంచుకోవాలని, విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలని, పాఠశాలలో ఉపాధ్యాయుల నుంచి కొత్త కొత్త విషయాలు నేర్చుకోవాలని, నాణ్యమైన ఆహారం తీసుకోవాలని, భావోద్వేగాలను అదుపులో ఉంచుకుంటూ సత్ప్రవర్తన అలవాటు చేసుకోవాలని, విద్యార్థి దశ నుంచే లక్ష్యం ఏర్పరచుకుని చదవాలని విద్యార్థులకు సూచించారు.అనంతరం కౌసల్య మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయోగం, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్న ఎస్ ఎస్ ఏ వారికి, విద్యార్థులకు మానసిక ఆరోగ్యం పై అవగాహన కల్పించిన సుధీర్ కుమార్ ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులతో పాటు ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రత్యామ్నాయ లైన్ తో వినియోగదారులకు ప్రయోజనం ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్



**కలిదిండి, మేజర్‌న్యూస్:** కలిదిండి మండలం కోరుకొల్లు గ్రామములో సబ్ స్టేషన్ వద్ద ఆల్టర్నేటివ్ లైన్ ప్రారంభించిన శాసనసభ్యులుడా.కామినేని శ్రీనివాస్. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతు ఇప్పటి వరకు చిగురుకోట సబ్ స్టేషన్ నుంచి వస్తున్న విద్యుత్ కొరత కారణంగా వినియోగదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో కలిదిండి నుంచి రూ. 1 కోటి 17 లక్షల తో ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ లైన్ ను ప్రారంభించటం జరిగినది అని తెలిపారు. దీనివలన విద్యుత్ వినియోగదారులకే కాకుండా అక్వా రైతులకు అధికలాభం చేకూరు తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలోఆంద్రాజు శ్రీనివాసరావు, పూలా రామచంద్రరావు (రాజి) ఎన్‌డిఏ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే మద్దిపాటి మార్కు పరిపాలన





**ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్:** మండలంలోని జాజులకుంట గ్రామంలో డ్రైనేజ్ వ్యవస్థను అస్తవ్యస్తంగా మిగిలిపోయింది. దానికి కార్యరూపం దాల్చి పక్కా డ్రైన్ నిర్మాణం చేపట్టి గ్రామంలో పారిశుద్ధ్యం లోపించకుండా ఉండటానికి ఆ గ్రామ పార్టీ అధ్యక్షులు సాయిలరమేష్ మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు లంకా సత్యనారాయణ ద్వారా, శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజుని మా గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. వెంటనే స్పందించిన శాసనసభ్యులు జిల్లా పరిషత్ నిధులనుంచి 38లక్షల రూపాయల నిధులు మంజూరు చేయించి పని పూర్తి చేశారు. అలాగే గ్రామంలో మౌలిక వసతుల కల్పనలో మారుమూల గ్రామంగా ఉన్న జాజులకుంట గ్రామానికి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ 200కేవీ మంజూరు చేసి పనులు పూర్తి చేశారు. సిమెంట్ రహదారి నిర్మాణానికి 10 లక్షల రూపాయలు మంజూరు చేసి పనులు పూర్తి చేశారు. మంచినీటి వాటర్ ట్యాంక్‌కి సుమారు1లక్ష రూపాయలుతో మెట్లు నిర్మాణం చేసి పూర్తిగా మరమ్మతులు చేశారు. ఇంకా గ్రామ అభివృద్ధికి 25లక్షల రూపాయల పనులు మంజూరు అయ్యాయి. వాటిని అడిగిన వెంటనే మా గ్రామానికి నిధులు కేటాయించిన శాసన సభ్యులు మద్దిపాటి వెంకటరాజుకి గ్రామస్తులందరూరుణపడి ఉంటామని వారు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## ఉపాధి హామీ చట్టాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలి

– సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** ఉపాధి హామీ చట్టాన్ని ప్రతిష్టంగా అమలు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.రవి కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జంగారెడ్డిగూడెం 12వ మండలం మహాసభలు మండలంలోని పట్టేన్నపాలెంలో నిర్వహించారు. సంఘం జెండాను కమిటీ సభ్యురాలు పూసం దుర్గ ఎగురవేశారు. అనంతరం జరిగిన మహాసభకు బోడిక సూర్యచంద్ర రావు అధ్యక్షత వహించారు. ముందుగా పుచ్చలపల్లి సుందరయ్య,కరువుల వెంకటలక్ష్మి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి,రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తామా ముత్యాలమ్మ, జిల్లా అధ్యక్షులు జీవరత్నం మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికుల కోసం సకల సౌకర్యాలు కల్పించాలని కోరారు. పలు సమస్యలపై ప్రసంగించారు. ఈ మహాసభలో యాగంటి సీత, అందుగుల ప్రభాకర రావు, వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

## ఐదుగురు ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి

**బుట్టాయిగూడెం,మేజర్‌న్యూస్:** ఎస్‌జిటిగా పనిచేస్తున్న నలుగురు ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందినట్లు ఐటీడీఏ పీవో రాములు నాయక్ తెలిపారు. మండలంలోని కోట రామచంద్రపురం ఐటీడీఏ వద్ద పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు నియామక పత్రాలను పిఓ రాములు నాయక్ శుక్రవారం అందజేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఎస్‌జిటిలుగా పనిచేస్తున్న మొడియం జయ లక్ష్మి, మల్లం వెంకటలక్ష్మి, బక్కా నాగమణి, మడకం సత్యనారాయణ, రావుల వెంకటేశ్వరరావులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించినట్లు ఆయన తెలియజేశారు. వీరికి పిఓ నాయక్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు.

## జిఎస్‌టిపై జంగారెడ్డిగూడెంలో అవగాహన ర్యాలీ




జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్: జి.ఎస్.టి 2.0 పై అవగాహన ర్యాలీ, కాలుష్య నివారణలో భాగంగా శుక్రవారం స్థానిక సి.ఎస్.టి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు జరిగాయి.

కళాశాల వాణిజ్య శాస్త్ర ,అర్థశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో జీఎస్టి 2.0 పై వక్తృత్వ, క్విజ్ పోటీలు జరిగాయి. కరపత్రాల పంపిణీతో కూడిన అవగాహన ర్యాలీని నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసాద్ బాబు,కళాశాల ఐక్యూ ఏపీ స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కో– ఆర్డినేటర్ డాక్టర్ ఎం.మధు మాట్లాడుతూ కాలుష్య నివారణ గురించి విద్యార్థులకు తెలిపారు.

ఈకార్యక్రమంలో అధ్యాపకులు సిహెచ్ రమాదేవి,శిరీష, బి.శ్రీనివాసరావు, హనుమంత రావు, డాక్టర్ గాళ్ళ శ్రీనివాస రావు, డాక్టర్ సన్యాసి రావు,బదరీ నారాయణ వెంకట లాల్ ,కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోటి సంతకాల పోస్టర్ ఆవిష్కరించిన ఎంపీపీ సోనీ



**నరసాపురం,మేజర్‌న్యూస్ :**మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షులు వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం పరిపాలనపై ప్రజల అభిప్రాయం ఈ నెల పదవ తేదీనుండి రాష్ట్రంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా స్థానిక వైసీపీ కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను ఎంపీపీ మైలా బత్తుల సోని,వైసీపీ నరసాపురం మండల అధ్యక్షులు ఉంగరాల రమేష్ నాయుడులు ఆవిష్కరించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలలోకి తీసుకువెళ్లి వాస్తవాలను ప్రజలకు వివరించాలన్నదే ఈ కార్యక్రమం ఉద్దేశం అన్నారు. ఏడాదిన్నర పాలనలో కూటమి ప్రభుత్వం అక్రమాలకు పాల్పడిందని, ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసారని ఇటువంటి విషయాలన్నీ రాష్ట్ర ప్రజలకు సంతకాల సేకరణ ద్వారా వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలోసరిపల్లి ఎంపీటీసీ చిన్నం వెంకట్రావు, వైసీపీ ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి కాకిలేటి ఆనంద్ కుమార్,సినియర్ నాయకులు మైలా బత్తుల శ్రీను,నల్లి జేవి.ఆర్,కడలి రాంబాబు,నాగేశ్వరావు, పులపర్తి ప్రతాప్,నిప్పేలేటి సత్యనారాయణ,కొల్లా బత్తుల రాంపండు, కత్తి మండ నాని చేరు కూరి ప్రసాద్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## జంగారెడ్డిగూడెంలో న్యాయ విజ్ఞాన సదస్సు




**జంగారెడ్డిగూడెం, మేజర్ న్యూస్:** ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని మండల న్యాయసే వాధికారి సంస్థ ఆధ్వర్య ంలో శుక్రవారం స్థానిక పేరంపేట రోడ్డులో గల పి.హెచ్. సి నందు న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి జంగారెడ్డిగూడెం బార్ ప్రెసిడెంట్ జి.ఎస్.ఆర్ మూర్తి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి ఆరోగ్యం కోసం ఖాళీ సమయాల్లో వ్యాయామం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జువ్వాల బాబుజి రావు, ఎం.గంగరాజు, కె.హరివాసు, నరేంద్ర,హాస్పిటల్స్ సిబ్బంది, ఫీల్డ్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## పీ.ఎం జీవనజ్యోతి బీమా డబ్బు అందజేత



**జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్:** ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యువజన పథకం ద్వారా సహజ మరణానికి మంజూరైన రూ.2 లక్షల భీమా పైకాన్ని జంగారెడ్డిగూడెం ఎస్ బి ఐ టౌన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ సతీష్ కుమార్ గురువారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ పాడిశెట్టి పద్మజ శ్రీనివాస్ ఎస్ బి ఐ సేవింగ్స్ అకౌంట్ ద్వారా ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యువజన పథకం నిమిత్తం ఏడాదికి రూ.436 లు చెల్లించారని తెలిపారు. ఖాతాదారుడు ఆకస్మిక మరణంతో అతని భార్య పాడిశెట్టి ఉమాకు రూ.2 లక్షల భీమా పైకాన్ని అందచేసా మన్నారు. ఖాతాదారులందరూ తప్పనిసరిగా ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకం పై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ కోటేశ్వరరావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభావంతులకు తరచూ వైద్య పరీక్షలు నిర్వహించాలి






ఉమ్మడి ప.గో.జిల్లా న్యాయ సేవాధికారి రత్న ప్రసాద్

పెదవేగి, మేజర్ న్యూస్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక దినోత్సవం సందర్భంగా పెదవేగి మండలం వంగూరు గ్రామంలోని జె అండ్ జె కరుణోదయ విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక పాఠశాల నందు శుక్రవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్న ప్రసాద్ మాట్లాడుతూ ఈ విభిన్న ప్రతిభావంతులకు తరచుగా వైద్య పరీక్షల నిర్వహించాలని, వారిని ఎప్పటికప్పుడు ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలని సూచించారు, వారికి వారి తల్లిదండ్రులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు ఉచిత న్యాయ సహాయం అందిస్తాయని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందటంలో కానీ మరి ఇతర న్యాయ సహాయం కావాల్సిన దగ్గరలోని న్యాయ సేవాధికార సంస్థలను కానీ లేదా 15100 నెంబర్ ద్వారా కానీ సంప్రదించాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సి డబ్ల్యూ.సి ఇన్చార్జి చైర్మన్ పి. వెంకటేశ్వర రావు, ప్యానల్ న్యాయవాది బి సంగీతరావు, జె అండ్ జె కరుణోదయ విభిన్న ప్రతిభావంతుల పాఠశాల చైర్మన్ డోమినిక్ కలతోటి, మానసిక వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# తూర్పు కాపు, గాజుల కాపుల సమస్యల పరిష్కారానికి కృషి





చైర్ పర్సన్ పాలవలస యశస్వి

**ఏలూరు,మేజర్‌న్యూస్:** తూర్పు కాపు, గాజుల కాపు కార్పొరేషన్ చైర్ పర్సన్ పాలవలస యశస్వి శుక్రవారం స్థానిక జడ్పీ మీటింగ్ హాల్‌లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా తూర్పు కాపు,గాజుల కాపు సంఘ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివిధ కార్పొరేషన్ల ద్వారా అమలుపరుచు పథకాలు వాటి వివరములను సంబందిత కార్పొరేషన్లకు తెలియపరిచినట్లయితే వారి ద్వారా బీసీ కులస్తులు ఆపదకాలకు దరఖాస్తు చేసుకొనుటకు అవకాశం కలుగుతుందని బిసి కార్పొరేషన్ ఈడి కి సూచించారు. ఈ సందర్భంగా తూర్పు కాపు గాజులు కాపు సంఘ ప్రతినిధులు ఓ.బి.సి కుల ధ్రువీకరణ పత్రము పొందుటలలో ఎదుర్కొంటున్న సమస్యలను చైర్ పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. తూర్పు కాపు, గాజులు కాపులకు చెందిన యువతకు ప్రత్యేకంగా ఐఏఎస్, గ్రూప్ 1,గ్రూప్ 2 పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వాలని, శిక్షణా కేంద్రాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో ఏర్పాటుచేయాలని కోరారు. తూర్పు కాపు, గాజులు,కాపు కార్పొ రేషన్ ద్వారా విదేశీ విద్యా పథకం అమలు చేయాలని ఈ సమావేశంలో నాయకులు కోరారు. ఈ సమావేశంలో తూర్పు కాపు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆర్టీసీ విజయవాడ ప్రాంతీయ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్లు లావేటి శ్రీనివాసరావు కరణం పెద్ది రాజు , ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా తూర్పు కాపు సంఘ ప్రతినిధి యస్ .రామారావు , బంకా ప్రసాదు , పిన్నింటి మహేశ్, శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ శరత్ చంద్ర , ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బి.సి. కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పుష్పలత ప్రభృతులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్స్ సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షులు రామచంద్రరావుకు సన్మానం



**జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్ :** అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ వేడుకలు సందర్భంగా భీమవరం శ్రీకృష్ణదేవరాయ సంస్కృతిక సమితి భవనం నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆల్ ఇండియా సీనియర్ సిటిజన్స్ సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షులు కుకునూరు రామచంద్ర రావును ఘనంగా సన్మానించారు. పట్టణ ప్రముఖులైన రామచంద్రరావును ఈ సందర్భంగా శుక్రవారం పలువురు ఆయనను అభినందించారు.

# బాత్రూమ్‌లో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



**ఏలూరు, మేజర్ న్యూస్:**ఏలూరు శనివారపు పేటకు చెందిన ఆటో డ్రైవర్ ఎర్ర వెంకటేశ్వరరావు (48) శుక్రవారం స్నానాల గదిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

భీమవరంలో కూతురు బీటెక్ చదువుతుండటంతో 9 నెలలుగా భార్యతో సహా వెంకటేశ్వరరావు అక్కడే ఉంటున్నారు ఇటీవల వ్యక్తిగత పనులపై ఆయన ఏలూరు వచ్చి ఉంటున్నాడు. త్రీ టౌన్ సీఐ కోటేశ్వరరావు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రామాలయం విగ్రహాలు మాయం

**24 గంటల్లో నిందితులు అరెస్టు**



**చింతలపూడి,మేజర్‌న్యూస్:** చింతలపూడి మండలం రేచర్ల పంచాయతీ రెండవ మైలు తండా వద్ద గురువారం రాత్రి రామాలయం నుండి విగ్రహాలు మాయమయ్యాయి. అయితే 24 గంటల్లోపే విగ్రహాలను కాపాడి నిందితులను చింతలపూడి పోలీసులు అరెస్టు చేశారు. రామాలయం తన సొంత స్థలంలో ఉందని చెప్పి, గుడిలోని విగ్రహాలను తొలగించి మాయం చేసినట్టు కేసు నమోదయింది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన దారావతు బాలు, దారావతు మంగమ్మ, దారావతు కృష్ణమూర్తి ప్రధాన నిందితులుగా పోలీసులు గుర్తించారు.

ధరవతు దీప్తి చేసిన ఫిర్యాదు ఆధారంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ క్రాంతికుమార్, సబ్ ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్ కేసు దర్యాప్తు చేసినట్టు తెలిపారు, నిందితులను అరెస్ట్ చేసి, దర్యాప్తు భాగంగా మాయం అయిన విగ్రహాలను నాగిరెడ్డిగూడెం ప్రాజెక్ట్ సమీపంలో స్వాధీనం చేసుకున్నారు.

# విశ్రాంత ఉపాధ్యాయుడిని ఘనంగా సన్మానించిన సహచర ఉపాధ్యాయులు



**ఆగిరిపల్లి,మేజర్‌న్యూస్:** ఆదర్శ ప్రాథమిక పాఠశాల (ఆగిరిపల్లి మెయిన్)లో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపా ధ్యాయునిగా పనిచేసి గత నెలలో పదవి విరమణ పొందిన రెడ్డి వెంకటేశ్వరరావు ను ఆ పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి 1 శిలా రపు హేబేలు మాట్లాడుతూ రెడ్డి వెంకటేశ్వరరావు క్రమశిక్షణ గల ఉపాధ్యాయు డని, అంకితభావంతో 31 సంవత్సరాల పాటు విద్యార్థులకు విద్యను అందించారని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి 2 కొవ్వలి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ రెడ్డి వెంకటేశ్వరరావు లాంటి ఉపాధ్యాయుడిని అందరు ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని తెలిపారు. ఆగిరిపల్లి స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ పి పుష్పలత మాట్లాడుతూ రెడ్డి వెంకటేశ్వరరావు 31 సంవత్సరాల పాటు విలువలతో కూడిన విద్యను అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చౌటుపల్లి విక్టర్ బాబు, పాఠశాల ఉపాధ్యాయులు మక్కే వేణుగోపాలరావు, దాసరి విజయ దుర్గ, భీమవరపు హర్షవర్ధని, సర్నాల అరుణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పద్మ, వైస్ చైర్మన్ సుల్తానా , తల్లిదండ్రులు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 12న కృత్రిమ కాళ్ల స్క్రీనింగ్ శిబిరంను వినియోగించుకోవాలి



జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్: ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్, జంగారెడ్డిగూడెం ఏజెన్సీ లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఈ నెల 12వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు కృత్రిమ కాళ్ళ స్క్రీనింగ్ శిబిరం ను నిర్వహిస్తున్నామని లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ దాసరి శేషు కుమార్ తెలిపారు. ఈ శిబిరంలో అవసరమైన వారందరూ ఉపయోగించుకోవాలసిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమం నందు పేర్లు నమోదు చేయించుకున్న వారు, చేయించుకొని వారు కూడా పాల్గొన వచ్చునని తెలిపారు. దివ్యాంగులైన వారికి కొలతలు తీసుకొని కృత్రిమ అవయవాలను మరుసటి కార్యక్రమంలో ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ స్క్రీనింగ్ శిబిరం కొత్త బస్టాండ్ పక్క రోడ్డులో గల రామ చంద్ర హై స్కూల్ పక్కన గల లయన్స్ క్లబ్ ఆడిటోరియం హాలులో మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగుతోందని తెలిపారు. శుక్రవారం జరిగిన ఈ సమావేశంలో లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ కొండపల్లి పండు,కాకర్ల వీరభద్ర రావు,మద్దిపాటి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉపాధ్యాయుడిని ఘనంగా సన్మానించిన సహచర ఉపాధ్యాయులు

**ఆగిరిపల్లి,మేజర్‌న్యూస్:** ఆదర్శ ప్రాథమిక పాఠశాల (ఆగిరిపల్లి మెయిన్)లో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపా ధ్యాయునిగా పనిచేసి గత నెలలో పదవి విరమణ పొందిన రెడ్డి వెంకటేశ్వరరావు ను ఆ పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి 1 శిలా రపు హేబేలు మాట్లాడుతూ రెడ్డి వెంకటేశ్వరరావు క్రమశిక్షణ గల ఉపాధ్యాయుడని, అంకితభావంతో 31 సంవత్సరాల పాటు విద్యార్థులకు విద్యను అందించారని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి 2 కొవ్వలి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ రెడ్డి వెంకటేశ్వరరావు లాంటి ఉపాధ్యాయుడిని అందరు ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని తెలిపారు. ఆగిరిపల్లి స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ పి పుష్పలత మాట్లాడుతూ రెడ్డి వెంకటేశ్వరరావు 31 సంవత్సరాల పాటు విలువలతో కూడిన విద్యను అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చౌటుపల్లి విక్టర్ బాబు , పాఠశాల ఉపాధ్యాయులు మక్కే వేణుగోపాలరావు, దాసరి విజయ దుర్గ, భీమవరపు హర్షవర్ధని, సర్నాల అరుణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పద్మ, వైస్ చైర్మన్ సుల్తానా, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# 10 గంటల పని విధానాన్ని రద్దు చేయాలి



**జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్:** కార్మికుల శ్రమ శక్తిని మరింత దోచుకోవటానికి 10 గంటల పని విధానం తీసుకువచ్చారని ఐ.ఎఫ్. టి.యు రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.వి.రమణ విమర్శించారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య ఇఫ్టు జంగారెడ్డిగూడెం పట్టణ కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక ధర్మన్న స్మారక భవనంలో ఎడ్లపల్లి బుజ్జియ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కె.వి.రమణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం కేంద్రం మెప్పు కోసం 8 గంటల పని విధానాన్ని రద్దుచేసి 10 గంటల పని విధానాన్ని తీసుకొచ్చిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని,లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా కార్మిక వర్గం ఉద్యమించి తగిన గుణపాటాన్ని కూటమి ప్రభుత్వానికి చెబుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మంచిలి రాజు,మెల్లేటి శ్రీనివాస్, ఎం.బాబూరావు,తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి ఏటివి వెహికల్ పోటీలలో ఛాంపియన్‌గా ఎస్ ఆర్ కె ఆర్ మెకానికల్ టీం






**భీమవరం, మేజర్ న్యూస్ :** ఫార్ములా ఆఫ్ రోడ్ మినీ భజ ఇండియా (ఫోమ్ బి) ఏ టి వి వెహికల్ పోటీలలో భారతదేశంలో భీమవరం ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు ఛాంపియన్ గా నిలిచి జ్ఞాపికలతో పాటు రు.90 వేల రూపాయలు క్యాష్ బహుమతి కూడా అందుకొని దేశంలోని అరుదైన ఖ్యాతి కళాశాలకు తీసుకువచ్చారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణంరాజు చెప్పారు.

మధ్యప్రదేశ్ లోని భోపాల్‌లో ఇస్ని మోటార్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 25 నుండి 29 వరకు భోపాల్‌లోని సాగర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ క్యాంపస్‌లో పోటీలు నిర్వహించారు. అందులో ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ కు చెందిన 23 మంది విద్యార్థుల బృందం “టీం గోదావరి” పేరిట పోటీల్లో పాల్గొన్నారు. ప్రధానంగా ఆల్ టెరైన్ వెహికల్ (ఏటివి) వాహనాన్ని మట్టి నీటిలో, మట్టి గుట్టపై నుండి సాఫీగా నడపటం, ఇంధనం ఎకానమీ లోను, లోడ్ టెస్ట్‌లో భాగంగా స్కార్పియో వాహనాన్ని లాక్కుని వెళ్ళటం, తక్కువ దూరంలో వేగంగా వెళ్లడం, వాహనం ఆగకు ండా మూడు గంటల పాటు నిర్విరామంగా నడపటం వంటి విభాగాల్లో కూడా ప్రథమ స్థానంలో టీం గోదావరి అగ్రస్థానములో నిలిచిందని మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ కలిదిండి సీతారామ రాజు, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్స్ ఎన్ సుదీర్ కుమార్ వర్మ, యు రాజేంద్ర ప్రసాద్, వివి మురళీకృష్ణమరాజులు చెప్పారు. దేశవ్యాప్తంగా 13 టీమ్స్ పోటీల్లో పాల్గొనగా ఎస్ ఆర్ కె ఆర్ గోదావరి టీం ఛాంపియన్‌గా నిలిచి అన్ని విభాగాలలో తన ప్రాధాన్యత చాటి చెప్పిందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా టీం గోదావరి డ్రైవర్ వై హరి సూర్య చరణ్, కెప్టెన్ ఎల్ శివమణి మాట్లాడుతూ సాహసోపేతమైన తమ విజయంలో కళాశాల యాజమాన్యం, డైరెక్టర్, ప్రిన్సిపల్, మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ అందించిన ప్రోత్సాహమే మాలో ధైర్యాన్ని నింపిందని పేర్కొన్నారు. సహచర బృందం కూడా నిరంతరం మమ్మల్ని ప్రోత్సహిస్తూ వాహనాన్ని ఎప్పటికప్పుడు లోపాలు సరిచేస్తూ విజయం బాటలో నడిపేలా చేయడంలో సమిష్టి కృషి, ప్రధాన భాగంగా నిలిచిందని పేర్కొన్నారు. తాము జీవితాంతం గుర్తుండిపోయే విజయాన్ని అందుకున్నామన్న ఆత్మవిశ్వాసాన్ని విద్యార్థులు బృందం వ్యక్తం చేసింది.

## నెలమూరు ఓడూరు గ్రామాల్లో ‘పల్లె పల్లెకు మన పితాని’



**పెనుమంట్ర, మేజర్ న్యూస్ :** నెలమూరు, ఓడూరు గ్రామాల్లో శాసనసభ్యులు పితాని సత్యనారాయణ శుక్రవారం పల్లె పల్లెకు మన పితాని కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల సమస్యలను ముఖాముఖిగా అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలు వివరించిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ మాట్లాడుతూ నెలమూరు గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించే దిశగా అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. హరిజన స్మశానవాటిక, హిందూ స్మశానవాటిక సమస్యలను పరిష్కరించేందుకు గ్రామంలోని ప్రభుత్వ భూములను తక్షణమే సర్వే చేయాలని తహసీల్దార్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఎన్టీఆర్ కాలనీ ప్రధాన రహదారి సమస్యను భూసేకరణ ద్వారా పరిష్కరించాలని ఆయన సూచించారు. అలాగే నెలమూరు పరిసర గ్రామాలకు లింక్ రోడ్లు, వంతెనలు, గ్రామంలోని సీసీ రోడ్లు, డ్రైనేజీ మరియు త్రాగునీటి సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. గ్రామ ప్రజల ప్రతి సమస్య పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని పితాని సత్యనారాయణ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మండల స్థాయి అధికారులు, అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు లాభదాయకం

ఐటీడిఏ పిఓ కె.రాములు నాయక్



**కొయ్యలగూడెం రూరల్, మేజర్ న్యూస్ :** ఎలక్ట్రానిక్ వస్తువులపై జిఎస్టి తగ్గింపు పై కొయ్యలగూడెం మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు కోట రామచంద్రపురం ప్రాజెక్ట్ ఆఫీసర్ కే. రాములు వర్తక వ్యాపారుల వారికి ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ లో ఎలక్ట్రికల్ వస్తువులపై తగ్గించిన మార్పులను వినియోగదారులకు లబ్ధి చేకూరేలాగా వివరాలను తెలపాలని అన్నారు. ఎం.డి.ఓ. కిరణ్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ వారు ప్రజలకు జీఎస్టీ యొక్క విశిష్టతను తెలుపుతూ అమ్మకాలు జరపాలని కేంద్ర ప్రభుత్వం సంస్కరణలో భాగంగా తీసుకొచ్చినటువంటి జీఎస్టీ విధానాన్ని ప్రతి ఒక్కరు స్వాగతించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మోహన్, వర్తక వ్యాపారులు అధికారులు పాల్గొన్నారు.

# కూటమికి సహకరిస్తున్నా ఎమ్మెల్యే పితాని మాపై విమర్శలు

పెనుమంట్ర సర్పంచ్, ఉప సర్పంచ్ ఆవేదన



**పెనుమంట్ర, మేజర్‌న్యూస్:** వాస్తవాలు తెలుసుకోకుండా గురువారం సాయంత్రం పెనుమంట్ర పంచాయతీ వద్ద జరిగిన పల్లె పల్లెకు మన పితాని అనే గ్రామ సభ లో సర్పంచ్, ఉప సర్పంచ్ లను కించపరిచే విమర్శలు మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యేపితాని సత్యనారాయణ చేయడం తగదని వారువాపోయారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పత్రికా సమావేశం జరిపి సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, ఉప సర్పంచ్ భూపతి రాజు వెంకట శ్రీనివాస రాజు, వార్డ్ సభ్యులు కొవ్వూరి మోహన్ రెడ్డి, తేతలి ప్రసాద్ రెడ్డి తదితరులు తమ ఆవేదన వెలిబుచ్చారు. గ్రామానికి చెంది అన్ని రకాలుగా కూటమి ప్రభుత్వానికి సహకరిస్తున్నా ఎమ్మెల్యే కి స్థానిక టీడీపి నాయకుడు ఒకరు తప్పు దోవ పట్టించి, తమ మీద ఆరోపణలు చేయడానికి కారణం అవుతున్నారని అన్నారు. స్థానిక ఎల్.ఈ. పాఠశాలలోని విద్యార్థులకుతీరని అన్యాయం జరిగినా దానినీ ఎమ్మెల్యే పితానిరాజకీయం చేయడం దారణం అని వారు తీవ్రంగా ధ్వజం ఎత్తారు. సర్పంచ్, ఉపసర్పంచ్‌లను ప్రోటోకాల్ ఉన్నా,సభల్లో విస్మరించి మనో వేదన కలిగిస్తున్నారని, దీనిపై ఆర్ డి ఓ కు పిర్యాదు చేస్తే, వారు ఆర్డర్ ఇచ్చారని, తమ చెక్ పవర్ రద్దుకు ఎమ్మెల్యే ప్రయత్నం చేస్తున్నారని సర్పంచ్ ఆరోపించారు.

## శ్రీకామాక్షి అమ్మవారి అన్న సమారాధనను ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు



**భీమవరం, మేజర్ న్యూస్:** భీమవరం ఓవర్ బ్రిడ్జి దగ్గర ఉన్న శ్రీ కామాక్షి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రారంభించారు. శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవాలు ముగింపు సందర్భంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి అన్న సమారాధనను నిర్వహించారు. ఎమ్మెల్యే అంజిబాబు మహా నివేదనకు హారతులు ఇచ్చి అన్న సమారాధనను ప్రారంభించారు. దైవ కార్యక్రమాల్లో అన్న సమారాధనలు నిర్వహించడం భగవత్ సేవతో సమానమని అన్నారు. వేలాది మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ యువజన సంఘం సభ్యులు పుట్ట నాగ ఫణి కుమార్, మందరపు వసంత్, ఆవుపాటి జగన్, అనుపోజు మురళీకృష్ణ, తమిళ్ సుబ్రమణ్యం, విశ్వబ్రాహ్మణ అధ్యక్షులు శ్రీశైలపునాగబాబు, భక్తులు పాల్గొన్నారు.

## న్యూజిలాండ్ వారి సహకారంతో అన్న ప్రసాద వితరణ



**టి.నర్సాపురం,మేజర్ న్యూస్ :** శ్రీ అన్నపూర్ణ విశాలాక్షి సమితి కాశీ విశ్వేశ్వర స్వామి దీవి క్షేత్ర ప్రాంగణంలో గల అన్నదాన భవనం నందు శుక్రవారం 9వ రోజు మాల ధరించిన భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం పల్లెర్లమూడి వాస్తవ్యులు యనమదల సౌరిబాబు,కుమారుడు నిర్వహించారు. న్యూజిలాండ్ లో నివసిస్తున్న తారకనాగేశ్వర్,హరిచందన దంపతుల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అన్నదాన కమిటీ సభ్యులు మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రతి సంవత్సరం వివిధ రకాల మాల ధరించి దీక్ష చేపట్టిన భక్తులకు గత16 సంవత్సరాలుగా దాతలు సహకారంతో ఏర్పాటు చేస్తున్నామని. అందులో భాగంగానే ఈ సంవత్సరం 17వ సంవత్సరం ఈ నెల 2 వ తేదీ దసరా పండుగ దగ్గర నుంచి సుబ్రమణ్య స్వామి షష్టి నవంబర్ 26 వరకు మాల ధరించిన భక్తులకు దాతల సహకారంతో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే ఎవరైనా మాల ధరించిన స్వాములు ఉంటే ఈ క్షేత్రంలో జరిగే అన్న ప్రసాదాన్ని స్వీకరించవచ్చుని, స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

## కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు చేయూత ఒక వరం

పిఎం,సిఎం,డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం



**కొయ్యలగూడెం,రూరల్ మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఆటో డ్రైవర్లకు ఒక వరం అని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి గంగిరెడ్ల మేఘాల దేవి తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆటో యూనియన్ డ్రైవర్లు నరేంద్ర మోడీ, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మేఘలాదేవి మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల కష్టాలను గుర్తించి కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ డ్రైవర్లకు ప్రతీ ఏటా 15వేల రూపాయలు నేరుగా వారి ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని , రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి పథంలో కూటమి ప్రభుత్వం నడిపిస్తుందని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.